క్లుప్తంగా

బయో టాయిలెట్ల ఏర్పాటుకు చర్యలు



స్థలాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్, ఎంఈ, ఏఈ

ఆదోని టౌన్: పట్టణంలో బయోటాయిలెట్స్ ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, ఏఈ వీరారెడ్డి ప్రధాన రోడ్లు, వీధుల్లో బయో టాయిలెట్ల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ప్రజల అవసరం మేరకు వాటిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. అనంతరం ఎంజీ వీధిలో వాటర్ వర్క్స్ సెక్షన్ మస్టర్ పాయింట్‌ను తనిఖీ చేశారు. గౌళిపేటలో పూడికతీత పనులను పరిశీలించారు. వర్షాలు కురిసేలోగా కాలువల్లో పూడికను పూర్తిస్థాయిలో తొలగించాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు మంజునాథ్, ఏఈ కృపావర్మ, రవి, మహ్మద్, పీటర్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడిగా మధుసూదన్‌శర్మ



ఆదోని అర్బన్ : ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య నూతన అధ్యక్షుడిగా వెల్లాల మధుసూదనశర్మ ఎన్నికయ్యారు. మంగళవారం నెల్లూరు నిర్వహించిన సమావేశంలో ఆ సమాఖ్య సభ్యులు ఏకగ్రీవంగా మధుసూదనశర్మను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పోతావఝ్జల పురుషోత్తమశర్మ (తెనాలి), కోశాధికారిగా కొత్తా సుబ్బారావు(విజయవాడ)ను ఎన్నుకున్నారు. ఇందుకు సహకరించిన మాజీ అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్‌కు, ప్రధాన కార్యదర్శి యనమండ సాయిసురేష్‌లకు నూతన అధ్యక్షుడు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

డీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గొట్ల చంద్రశేఖర్

కోసిగి: కోసిగి మండలం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి గొట్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఇందులో మండల అధ్యక్షుడిగా బీపీ రంగస్వామి, ఉపాధ్యక్షులుగా వెంకట లక్ష్మి, లావణ్య, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశప్ప, కార్యదర్శులుగా ఖాజాబందా, పుణ్యావతి, మీనాక్షిలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కమిటీ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మార్చి నెలలో జరిగిన 10వ తరగతి పరీక్షలకు చీఫ్, డిపార్ట్ మెంట్ అధికారులను రెమ్యూనరేషన్ చెల్లించాలన్నారు. అలాగే ఏప్రిల్ నెలలో 10వ తరగతి పరీక్షల మూల్యాంకణం చేసిన ఉపాధ్యాయులకు పారితోషకం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మనోరంజని, జిల్లా కౌన్సిలర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి

కౌతాళం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలు జరుగుతున్నాయని, పది ఉత్తీర్ణులైన విద్యార్థులు చేరాలని ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కాలేజీలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో ఉన్నాయన్నారు.ఆసక్తి గల విద్యార్థులు వచ్చే నెల 12వ తేదీలోగా అడ్మిషన్లు పొందాలన్నారు.

నాగేంద్రనగర్‌లో చోరీ

కర్నూలు: నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగేంద్రనగర్‌లో నివాసముంటున్న ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడు రమణ ఇంట్లో చోరీ జరిగింది. ఈయన ఈనెల 13న ఇంటికి తాళం వేసి మానవపాడుకు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు తాళాలు పగుల గొట్టి పడక గదిలోకి వెళ్లి బీరువాను బద్దలుకొట్టి అందులో ఉన్న 9 తులాల బంగారు, వెండి ఆభరణాలను మూటగట్టుకుని ఉడాయించారు. సోమవారం సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండటం, బీరువాలోని సామగ్రి చిందరవందరగా పడివుండటం చూసి చోరీ జరిగిందని నిర్ధారించుకుని నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దొంగల కోసం గాలిస్తున్నారు.

హజ్ యాత్రికుల ఖాతాలకు నగదు జమ

కర్నూలు(రాజ్‌విహార్):ప్రభుత్వ ఆర్థిక సాయం నగదును హజ్ యాత్రికుల వ్యక్తిగత ఖాతాలకు మంగళవారం జమ చేసింది. హజ్ యాత్రకు వెళ్లే 274 మంది కర్నూలు జిల్లా వాసులకు, 121 మంది నంద్యాల వాసులకు రూ.80 వేల చొప్పున మొత్తం రూ.3.16 కోట్లు జమ చేశారు. హజ్ యాత్రకు వెళ్లక ముందే ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని యాత్రికుల ఖాతాలోకి జమ చేయడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు హఫీజ్ మంజూర్ అహ్మద్ పేర్కొన్నారు.

పల్లెసీమలు ప్రగతి బాట

- ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు
- పల్లెల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైప్‌లైన్ పనులు ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



తుంబిగనూరు గ్రామంలో గడప గడప నిధులతో పూర్తి చేసి సీసీ రోడ్డు



నేలకోసిగిలో రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

కోసిగి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంతో పల్లెలు అభివృద్ధి బాట పడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. దీని వల్ల వివిధ వర్గాల ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారు. ఈ మూడున్నరేళ్ల పాలనలో పథకాల అమలు, చేకూరిన లబ్ధి గురించి ఇంటింటికీ వెళ్లి తెలియజేయడంతో పాటు ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందాయా లేదా అని ఆరా తీస్తున్నారు. అర్హత ఉండి రాని వారికి సంబంధిత అధికారితో మాట్లాడి అందించేలా చూస్తున్నారు. అలాగే సచివాలయాల పరిధిలోని సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారం చూపుతున్నారు. ఇందుకు ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20లక్షలు నిధులు కేటాయించడంతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన పనులు జోరందుకున్నాయి.

13 సచివాలయాల పరిధిలో గడపగడపకూ పూర్తి

మంత్రాలయం నియోజకవర్గ పరిధిలోని కోసిగి మండలంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. మండలంలోని 19 సచివాలయాలు ఉండగా అందులో ఇప్పటి వరకు 13 సచివాలయాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. తుంబిగనూరు, సాతనూరు, అగసనూరు, వందగల్లు, దుద్ది, ఆర్లబండ, చింతకుంట, డి.బెళగల్, సజ్జలగుడ్డం , చిర్తనకల్లు, కోసిగిలోని 1, 2, 3 వ సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం పూర్తి అయింది. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.ప్రధానంగా డ్రైనేజీలు, సీసీ రోడ్లు, తాగునీటి వసతి పనులకు నిధులు వెచ్చిస్తున్నారు.

గ్రామాల వారీగా జరిగిన పనులు

సాతనూరు సచివాలయం పరిధిలోని సాతనూరులో రూ.15 లక్షలతో 215 మీటర్ల డ్రైనేజీ, సీసీ రోడ్డు, తుంబిగనూరులో రూ. 5 లక్షలతో 54 మీటర్ల సీసీ రోడ్డు వేయించారు. అలాగే అగసనూరులో రూ.12లక్షలతో 220 మీటర్లు, నేలకోసిగిలో రూ.10 లక్షలతో 126 మీటర్లు, కోసిగి-1 పరిధిలో దొరలచావిడి నుంచి కట్టల గేరి యల్లయ్య ఇంటి వరకు రూ.10 లక్షలతో 140 మీటర్లు, సచివాలయం-2 పరిధిలో హిందూ గర్ల్స్ స్కూల్ పరిధిలో కొత్తపేట కాలనీకి రూ.8 లక్షలతో 120 మీటర్లు, సచివాలయం -3 పరిధిలో రూ.10 లక్షలతో మార్కండేయ స్వామి దేవాలయం ముందు భాగంలో 130 మీటర్లు, మరో రూ.10 లక్షలతో శ్మశాన వాటికకు డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు. వందగల్లులో రూ.10 లక్షలతో తాగునీటి పైప్ లైన్ పనులు చేపడుతున్నారు. మిగిలిన సచివాలయాల్లో త్వరలో పనులు ప్రారంభించనున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో పనులు వేగవంతంగా జరుగుతుండటంతో గ్రామీణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అన్నీ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మా గ్రామం నూతన పంచాయతీగా ఏర్పడింది. ఎమ్మెల్యే నిధులు, పంచాయతీ నిధులు, గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో ఊరిలోని అన్నీ కాలనీల్లో డ్రెయినేజీలు, సీసీ రోడ్లు వేయించాము. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సహకారంతో మా గ్రామం అభివృద్ధి బాట పట్టింది.

– వారం ఈరన్న, సర్పంచ్ తుంబిగనూరు

వేగవంతంగా అభివృద్ధి పనులు



గడప గడపకూ మన ప్రభుత్వం కింద ప్రతి సచివాలయానికి సర్కారు రూ.20 లక్షలు మంజూరు చేస్తోంది. ఈ నిధులతో గ్రామాల్లో ప్రజలకు అవసరమైన పనులు చేయిస్తున్నాం. పంచాయతీ రాజ్ కింద దాదాపు రూ.80 లక్షలతో 8 సచివాలయాల పరిధిలో డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు పూర్తి చేయించాం. మిగిలిన సచివాలయాల పరిధిలో కూడా పనులు వేగవంతం చేశాం.

– యుగంధర్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ, కోసిగి

యల్లమ్మవ్వకు ప్రత్యేక పూజలు



అవ్వను దర్శించుకుంటున్న భక్తులు

ఆదోని అర్బన్ : పట్టణశివారులోని యల్లమ్మవ్వ కొండలో వెలిసిన శ్రీ రేణుకా యల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు పిండివంటలు, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు మోహన్‌ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామున పంచామృతాభిషేకం, చీర, ఆకుపూజలు, ఆభరణాల అలంకారం, మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. అవ్వవారి ప్రతిమను ఊరేగించారు. వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అవ్వను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



పెండేకంటి చిన్నగౌడ(ఫైల్)

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని కాశమ్మ గడ్డ కాలనీలో నివసిస్తున్న శతాధిక వృద్ధుడు పెండేకంటి చిన్నగౌడ (102) మంగళవారం మృతి చెందాడు. ఈయన కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ప్రధానమంత్రి ఇందిగాంధీ హయాంలో కోసిగి మండలంలో కాంగ్రెస్ నాయకుడిగా సేవలందించాడు. 102 ఏళ్ల వయస్సులో కూడా చిన్నగౌడ స్వయంగా పనులు చేసుకునే వారు. అనారోగ్యంతో మృతి చెందడంతో కాంగ్రెస్ పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతాపం ప్రకటించారు. ఆయనకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



మత్స్యకారులకు ద్విచక్రవాహనాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

- సబ్సిడీపై ద్విచక్ర వాహనాల పంపిణీలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

కోసిగి: మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని తుంబిగనూరు గ్రామానికి చెందిన ఇద్దరు మత్స్యకారులకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద సబ్సిడీపై ద్విచక్రవాహనాలు మంజూరయ్యాయి. మంగళవారం ఎమ్మెల్యే స్వగృహం రాంపురంలో జరిగిన కార్యక్రమంలో వాటిని మత్స్యకారులకు అందజేశారు. అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఫిషరీస్ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ మత్స్య కార భరోసా కింద ఏటా రూ.10 వేలు సహాయం అందిస్తున్నారన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఇచ్చే ఒక్కో బైక్ , ఐస్ బాక్స్‌తో కలిపి ధర రూ.75 వేలు విలువ చేస్తోందన్నారు. ఇందులో ఎస్సీలకు 60శాతం సబ్సిడీ, బీసీలకు 40 శాతం సబ్సిడీ తిరిగి వారి ఖాతాల్లో జమ అయిందన్నారు.కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి, విలేజ్ ఫిషరీస్ అధికారిణి చంద్రకళ బాయి, ఫీల్డు ఆఫీసర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ కోసం దువా చేయండి

- హజ్ యాత్రికులకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి విజ్ఞప్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని అర్బన్ : సీఎం జగన్‌కు అల్లా దయ కోసం మక్కామదీనాలో ప్రత్యేక దువా చేయాలని హజ్ యాత్రికులకు ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పరితపిస్తున్న జగన్ 2024లో కూడా తిరిగి సీఎం కావాలన్నారు. ఇందుకు ఆదోని ఎమ్మెల్యేగా తనను భారీమెజార్టీతో గెలిపించాలన్నారు. మంగళవారం జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. ఆదోని కమిటీ అధ్యక్షుడు ముస్తాక్‌అహ్మద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. హజ్ యాత్రికులకు గత పది సంవత్సరాలుగా భోజన వసతి కల్పిస్తున్న మూన్ ఆప్టికల్స్ యజమాని సలాంసాబ్‌ను ప్రత్యేకంగా అభినందించి, అతని కుమారుడు షాభాజ్‌ను సన్మానించారు. దేశంలోని పలు ప్రాంతాల్లో గెలుపు ఓటములను నిర్ణయించే స్థాయిలో ముస్లింలు ఉన్నారన్నారు. తాను మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికకు ముస్లింలు ఎంతో సహకరించారన్నారు. ఆదోని నుంచి పలువురు ముస్లింలు వివిధ పదవుల్లో ఉన్నారన్నారు. ఈద్గా నిర్మాణం కోసం రూ.2.60 కోట్లు మంజూరు చేయించి టెండర్లు కూడా పిలవడం జరిగిందన్నారు. త్వరలోనే పనులు చేపడతామన్నారు. మైనార్టీ, ఐటీ కాలేజీను త్వరలోనే పట్టణంలో ప్రారంభిస్తామన్నారు. అలాగే ప్రభుత్వం బాలికల ఉర్దూ కళాశాలను ఆదోనిలో ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం స్థల పరిశీలన పూర్తి అయ్యిందని తెలిపారు. అర్ధాంతరంగా ఆగిపోయిన షాదీఖానా నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో శిక్షకులు మౌలానా అబ్దుల్ మజీద్, కౌడల్‌పేట్ సయ్యద్ అమాన్, ఎస్‌ఎంబీ హన్ను, అహ్మద్, అహ్మద్‌హుసేన్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

అనవసర విద్యుత్ కోతలు లేవు



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ డీఈ సుధాకర్‌కుమార్

ఆదోని అర్బన్ : పట్టణంలో ఏదైనా విద్యుత్ సమస్య వస్తే తప్ప అనవసరంగా విద్యుత్ కోతలు విధించడంలేదని విద్యుత్‌శాఖ డీఈ సుధాకర్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక తన విలేకరులతో మాట్లాడారు. ఏదైనా పెద్ద సమస్య వస్తే ముందుగానే పత్రికా ప్రకటన ద్వారా విద్యుత్ అంతరాయం కలిగిస్తున్నామని వినియోగదారులకు తెలియజేస్తున్నట్లు చెప్పారు. గాలీవానతో విద్యుత్ స్తంభాలు గానీ, తీగలు గానీ పడిపోయినప్పుడు వెంటనే మరమ్మతు పనులు చేస్తున్నామన్నారు. విద్యుత్ కోతలు విధిస్తే ముందుగానే రిజిస్టర్ సెల్ నంబర్‌కు మెసేజ్ పంపుతామని చెప్పారు.

దరఖాస్తు చేసుకున్న నెలలోనే వ్యవసాయ కనెక్షన్

దరఖాస్తు చేసుకున్న రైతులకు నెల రోజుల్లోపే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఇస్తామని డీఈ సుధాకర్‌కుమార్ తెలిపారు. కనెక్షన్ కోసం రైతు డబ్బు చెల్లించిన రోజు నుంచి నెలలోపు కనెక్షన్ ఇస్తామన్నారు. ఏప్రిల్ నెలలో 587 మంది రైతులు వ్యవసాయ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అందులో డబ్బు చెల్లించిన 305 మంది రైతులకు నెలలోపే కొత్త కనెక్షన్లు ఇచ్చామన్నారు. ఈనెలలో 236 దరఖాస్తులు వచ్చాయని త్వరలోనే వారికి కూడా కనెక్షన్లు అందిస్తామన్నారు. ఇప్పటివరకు 8,315 వ్యవసాయ కనెక్షన్లను రైతులకు అందించామన్నారు. డీఈ వెంట ఏడీఈ పురుషోత్తం, ఏఈ నాగభూషణం, సిబ్బంది ఉన్నారు.

విన్నపం

బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

పెద్దకడబూరు: ఆదోని నుంచి పెద్దకడబూరుకు నడుపుతున్న బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, సీఐటీయూ మండల కార్యదర్శి ఈరన్న కోరారు. మంగళవారం వారు ఆదోనిలో డిపో మేనేజర్ రఫిక్‌అహ్మద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు కల్లుకుంట, చిన్న తుంబళం గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్నారన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పెద్దకడబూరుతో పాటు వయా కల్లుకుంట, చిన్నతుంబళం గ్రామాలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు.

ఆ స్కూళ్లపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: నిబంధనలకు విరుద్ధంగా ముందుగానే అడ్మిషన్లకు శ్రీకారం చుట్టిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఎజాజ్ అహమ్మద్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. పట్టణంలోని మాచాని సోమప్ప ఇంగ్లిష్ మీడియం స్కూల్, శ్రీచైతన్య, నారాయణ, గుడ్‌బేస్, బాష్యం, గుడ్‌షప్పర్డ్ తదితర పాఠశాలలు నిబంధనలు పాటించడం లేదన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



డెంగీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న ఆదోని డివిజన్ మలేరియా అధికారి మంజునాథ్

కౌతాళం: డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదోని డివిజన్ మలేరియా అధికారి మంజునాథ అన్నారు. మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని బదినేహాల్ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు డెంగీపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ జ్వరం రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏ మాత్రం దీనిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. జ్వరం తీవ్రతను బట్టి స్థానికంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ర్యాలీలో బదినేహాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ కిరణ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు పరిశుభ్రంగా ఉంచాలి



కౌతాళంలో గ్రంథాలయ రికార్డులు పరిశీలిస్తున్న చైర్మన్ సుభాష్ చంద్రబోస్

కౌతాళం : గ్రంథాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ సుభాష్ చంద్రబోస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం కౌతాళంలోని గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అన్నీ పుస్తకాలు పాఠకులకు అందుబాటులో ఉంచాలన్నారు. పరిశుభ్రతపై లైబ్రేరియన్ మధులీనాకు సూచనలు చేశారు.

ఉర్దూ మీడియం విద్యార్థులకు ఉచిత శిక్షణ

కర్నూలు సిటీ: డైట్ సెట్‌కు సన్నద్ధం అయ్యే ఉర్దూ మీడియం విద్యార్థులకు స్థానిక ఉస్మానియా డిగ్రీ కాలేజీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రీజినల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధనలో అనుభవజ్ఞులైన అధ్యాపకుల చేత శిక్షణ ఇప్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9849896996,8074421688 సంప్రదించవచ్చన్నారు.

ఉద్యోగ మేళాకు విశేష స్పందన

కర్నూలు సిటీ: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నగరపాలక సంస్థ మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్ హాజరై ప్రసంగించారు. ఇలాంటి అవకాశాలను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ మేళాలో వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరై 232 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరాశాంతి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఉపాధి, కల్పన అధికారి సోమశివారెడ్డి, సీడాప్ జిల్లా మేనేజర్ కిరణ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను కట్టడి చేయండి

- ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్: బాల్యవివాహాలతో అనర్థాలు అధికమని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి కట్టడి చేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన బాల్యవివాహాల నియంత్రణపై డివిజన్‌లోని అధికారులతో తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ పేదరికం, నిరక్షరాస్యత, వలసలు, మూఢ నమ్మకాలు, ఆడపిల్లల భద్రత తదితర కారణాల వల్ల బాల్యవివాహాలు జరుగుతున్నాయన్నారు. బాల్యవివాహాల నివారణకు రాష్ట్రంలో ఉన్న మహిళా కలెక్టర్లు, మహిళా ఎస్పీలతో రాష్ట్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాలికలకు 18 యేళ్లలోపు, బాలురకు 21 యేళ్లలోపు వివాహాలు చేయరాదన్నారు. ప్రధానంగా ఆడ పిల్లలకు చిన్న వయస్సులో వివాహాలు చేయడం ద్వారా మాతృ మరణాలు సంభవిస్తున్నాయన్నారు. దీనిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోవాలన్నారు. మనకెందుకులే అనుకోకుండా బాల్యవివాహాల సమాచారాన్ని పై అధికారులకు తెలియజేయాలన్నారు. 1902 నంబర్‌కు కూడా కాల్ చేయవచ్చన్నారు. వయస్సుకు ముందే పెళ్లి చేయడం వల్ల కలిగే అనర్థాలపై వలంటీర్లు, ఏఎన్ఎంలు గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేయాలన్నారు. గర్భిణులు, కౌమారదశలో ఉన్న బాలికల్లో రక్త హీనత నివారణకు ఐరన్ ఫోలిక్ మాత్రలు అందించాలన్నారు. బడిఈడు పిల్లలు బడిలో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్‌లు, సీడీపీఓలు, ఎంపీడీఓలు, పోలీసు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

ఆదోని రూరల్ : రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో 'రోడ్డు సేఫ్టీ'పై సమావేశం నిర్వహించి మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ఓవర్‌లోడ్, ఓవర్‌స్పీడ్ వాహనాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. స్కూల్ ఆటోలో ఎక్కువ సంఖ్యలో ప్రయాణిస్తుంటే వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే చోట ఆ యొక్క ప్రదేశాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించి అక్కడ నేమ్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించనివారిపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరాదీప్తి, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రాసెసింగ్ యూనిట్ల తనిఖీ



ప్రాసెసింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి, ఏడీఏ సాలురెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): సబ్సిడీపై పంపిణీ చేసే వేరుశనగను ప్రాసెసింగ్ చేస్తున్న ప్రాసెసింగ్ యూనిట్లను జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తనిఖీ చేశారు. మంగళవారం కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని శివసాయి సీడ్స్, శ్రీకృష్ణ సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్లలో వేరుశనగ ప్రాసెసింగ్ ప్రక్రియను పరిశీలించారు. 100 శాతం నాణ్యతతో ఉండాలని ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులు, ఏపీసీడ్స్ అధికారులను ఆదేశించారు. ప్రాసెసింగ్ అయిన వేరుశనగను ఆర్‌బీకేలలో రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇప్పటి వరకు ఆర్‌బీకేలకు 600 క్వింటాళ్ల వేరుశనగను తరలించినట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు జిల్లా వ్యవసాయ అధికారికి వివరించారు. కర్నూలు పరిసరాల్లో 6 ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయని, అన్నింటిలోనూ పూర్తి నాణ్యతతో వేరుశనగ విత్తనం కాయలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, కర్నూలు, కల్లూరు ఏఓలు విశ్వనాథ్, శ్రీనివాసరెడ్డి,సాంకేతిక ఏఓ రాఘవేంద్ర పాల్గొన్నారు.